## వికలాంగ ధ్రువ పత్రాల కోసం ధరఖాస్తు చేసుకోవాలి -డీఆర్‌డీఓ కృష్ణన్

**వికారాబాద్, జనవరి 30, ప్రభాతవార్త:**
వికలాంగులకు సదరము క్యాంపు ద్వారా వికలాంగుల ధ్రువ పత్రాలు జారీ కోసం మీ సేవా కేంద్రాల ద్వారా ఈనెల 31 న స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్‌డీఓ కృష్ణన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంపులు ఫిబ్రవరి 2 న ఓహెచ్ కేటగిరిలో సీహెచ్‌సీ వికారాబాద్ నందు, 9న ఓహెచ్ కేటగిరిలో ప్రభుత్వ ఆసుపత్రి తాండూర్ లో, 16 న ఓహెచ్ కేటగిరిలో సీహెచ్‌సీ వికారాబాద్ వద్ద, 23న ఓహెచ్ కేటగిరిలో ప్రభుత్వ ఆసుపత్రి తాండూర్ నందు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి క్యాంపునకు 50 మంది చొప్పున ఫిబ్రవరి మాసములో 200 మందికి అసెస్‌మెంట్ చేయబడుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త



## ఘనంగా బీరప్ప బోనాలు

**షాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :**
బీరప్ప స్వామి సల్లంగా సూడు.... అంటూ షాబాద్ మండల పరిధిలోని వెంకమ్మగూడ గ్రామంలో సోమవారం బీరప్ప స్వామికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించుకున్నారు. బీరప్ప ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. గ్రామంలో ప్రతి ఇంటి నుండి బోనాలతో డప్పుదరువుల మధ్య బయలుదేరారు. మహిళల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దూరి శకుంతలపాండు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



బోనాలతో ఆలయానికి బయలుదేరిన గ్రామస్థులు

## మన ఊరు-మనబడి మోడల్ పాఠశాలలను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలి : కలెక్టర్

ప్రభాతవార్త వికారాబాద్

**జిల్లా ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు–మనబడి మోడల్ పాఠశాలల పనులను రేపటి వరకు అన్ని హంగులతో ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ నిఖిల పేర్కొన్నారు. సోమవారం వికారాబాద్ జిల్లా నవాబు పేట మండలంలోని మాదారం గ్రామంలో ఎంపికైన మోడల్ పాఠశాల పనుల పురోగతిని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..జిల్లాలో ఎంపికైనా మన ఊరు -మన బడి మోడల్ పాఠశాలలను త్వరలో ప్రారంభించుకోబోతున్నామని, పెండింగ్ పనులు అన్నిటిని రేపటి వరకు పూర్తి చేసి అన్ని హంగులతో సిద్ధం చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చేపట్టిన పనులను పరిశీలించారు. తరగతి గదులు ,మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, హ్యాండ్ వాష్, ఫ్లోరిం గ్, కలరింగ్ పనులను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఫ్లవర్ పార్ట్స్ ఏర్పాటు చేయాలని సూచించా రు. అవసరమైన గ్రీన్ చాక్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుకా దేవి, టిఎస్ ఈడబ్ల్యూఐడిసి డిఈ రాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ,మండల స్పెషల్ ఆఫీసర్ నవీన్ చంద్ర, సర్పంచ్ అంజయ్య, ఎంఈఓ గోపాల్, ఎంపివో విజయ్ కుమార్, పాల్గొన్నారు.

### కొత్తూర్ పురపాలికకు రూ.32.51 కోట్లు మంజూరు : ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**కొత్తూర్, జనవరి 30, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కొత్తూర్ పురపాలిక ప్రాంతాభివృద్ధి కోసం రూ.32.51 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తెలిపారు. కొత్తూర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తర్వాత జరిగిన తొలి ఎన్నికల సందర్భంగా కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఈ నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... పాలకవర్గ సభ్యులు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు పార్టీలకతీతంగా కౌన్సిలర్లు అందరూ కలిసి వచ్చి పురపాలిక సమగ్ర అభివృద్ధి కొరకై సహకరించాలన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలోని 12వార్డులలో సీసీ రోడ్లు అండర్ డ్రైనేజీల కోసం ఈ నిధులు మంజూరు అయ్యాయన్నారు. మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని పురపాలక పరిధిలోని ఏయే ప్రాంతాల్లో ఏయే అభివృద్ధి పనులు అవసరమో వాటిని ముందుగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పురపాలిక అభివృద్ధి కొరకు భారీ స్థాయిలో నిధులు మంజూరు కవడానికి కృషి చేసిన ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు పురపాలిక పాలకవర్గం ప్రత్యేక కృతజ్ఞతలను తెలియజేసింది.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

# షాద్‌నగర్‌లో దూకుడు పెంచిన కాంగ్రెస్

**- కాంగ్రెస్ స్పీడ్ చూస్తుంటే ముందస్తు ఎన్నికలు ఖాయమా అన్న అనుమానాలు...?**
**- ప్రతి మండలంలో పార్టీ కార్యాలయాలు ప్రారంభిస్తున్న కాంగ్రెస్**
**- నాయకులు, కార్యకర్తల్లో జోష్ నింపుతున్న వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, జనవరి 30, (ప్రభాతవార్త) :**
రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమాన్ని చేపట్టిన ఆ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడంలో ముందుండే వీర్లపల్లి శంకర్ తన సొంత నియోజకవర్గమైన షాద్‌నగర్‌లో కార్యక్రమాలను చేపట్టడంలో, అవి దిగ్విజయం చేయడంలో ఇంకెంత ముందుంటాడో చెప్పకనే చెపుతున్నాడు. నూతన సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గంలో తన కార్యక్రమాలు ముమ్మరం చేసి కాంగ్రెస్ శ్రేణుల్లో స్పీడ్ పెంచుతున్నాడు. ఏ క్షణమైన ఎన్నికలు రావచ్చునని నియోజకవర్గంలో అప్పుడే ఎన్నికల వేడిని కాంగ్రెస్ నాయకుల్లో, కార్యకర్తల్లో నింపుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలను చూస్తుంటే సామాన్య ప్రజలకు సహితం ఎన్నికలు ముందస్తు రాబోతున్నాయా అన్న అనుమానం కలగమానడం లేదు. ఏది ఏమైనప్పటికీ నియోజకవర్గంలో ఇతర పార్టీల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. మరి ఓ సారి పూర్తిగా పరిశీలిస్తే...

**ఇక్కడ.... కాంగ్రెస్‌కు ఘన కీర్తి...**

షాద్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఘనమైన చరిత్ర కలిగి ఉంది. 30, 40 సంవత్సరాల పాటు షాద్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచింది. నియోజకవర్గంలో మొత్తం 13 సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే 9 సార్లు కాంగ్రెస్, 2 సార్లు టీడీపీ, 2 సార్లు టీఆర్ఎస్ పార్టీలు విజయాలు సాధించాయి. ఈ పార్టీ గుర్తు పై గెలిచిన శంకర్‌రావు ఇక్కడ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, అందులో ఒకసారి మంత్రిగా సహితం పనిచేసి కాంగ్రెస్ పార్టీని పటిష్ట స్థితిలో నిలిపారు. అనంతరం రిజర్వేషన్ల తొలగింపులో 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పోటీ చేసి గెలుపొంది షాద్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్‌కు కంచుకోట అని మరోసారి రుజువు చేశారు. కానీ అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిన తరువాత నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికిని దెబ్బతీస్తు ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ 2 సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి నియోజకవర్గంపై పూర్తి పట్టు సాధించారు. అదేవిధంగా టీఆర్ఎస్ పార్టీ ఆపరేషన్ ఆకార్ష్ అనే నినాదంతో ఇతర పార్టీల నాయకులను భారీగా టీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంది. అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సహితం టీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కులేకుండా పోయింది.

**నేనున్నాను అంటూ వచ్చిన వీర్లపల్లి శంకర్.**

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్న



సమయంలో పార్టీని ముందుండి నడిపించడానికి నేను న్నాను అంటూ వీర్లపల్లి శంకర్ తన అనుచరులతో కలిసి 2018 ఎన్నికల తరువా త పార్టీలోకి వచ్చారు. అప్పటి నుంచి రాష్ట్రంలో, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఏ కార్యక్రమాన్ని చేపట్టిన వీర్లపల్లి శంకర్ తనదైన శైలిలో ముందుండి పార్టీని నడిపిస్తూ అధిష్టానం దృష్టిలో పడ్డారు. దీంతో నియోజకవర్గానికి ఇంఛార్జిగా, టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పార్టీలోని అంతర్గత విబేదాలను తొలగిస్తూ అందరిని ఒక్కతాటిపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తూ నేడు నియోజకవర్గంలో అందరి నోట శభాష్ వీర్లపల్లి శంకర్ అని అనిపించుకుంటున్నారు.

**ముందస్తు ఎన్నికలు ఖాయమా....?**

నియోజకవర్గంలో కాంగ్రెస్ దూకుడు చూస్తుంటే ముందస్తు ఎన్నికలు ఖాయమా అన్న అనుమానాలు ప్రజల్లో మొదలవుతున్నాయి. ఇప్పుడు నియోజకవర్గంలో ఎటు చూసిన ముందస్తు ఎన్నికల విషయమై చర్చించుకుంటున్నారు. దీనికి తగ్గట్లుగానే కాంగ్రెస్ పార్టీ మండలాల్లో నూతన పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ తన దూకుడును పెంచుకుంటుంది. మరో వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీ చేపట్టబోయే పాదయాత్ర సహితం నియోజకవర్గంలో ఘన విజయం చేయాలని చూస్తున్నారు కాంగ్రెస్ శ్రేణులు. ఏది ఏమైనప్పటికి అటూ బీఆర్ఎస్, ఇటు బీజేపీ పార్టీల కంటే ముందు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల వ్యూహాలు చాలా పకడ్బందిగా అమలు చేయడంలో ఈ సారి కొంత ముందు ఉందనే సాంకేతాలు ప్రజల్లోకి తీసుకెళుతుంది. మరి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తనకు కంచుకోటగా పేరు ఉన్న షాద్‌నగర్‌ను ఎలా కైవసం చేసుకుంటుందో వేచిచూద్దాం...

**ఎన్నికలు ఎప్పుడు వచ్చిన మేము సిద్ధం....**

రాష్ట్రంలో ప్రస్తుతం టీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక పాలన చేస్తుంది... అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టి వారిని నిలువున ముంచుతున్న టీఆర్ఎస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాము. నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటలు చేస్తున్నాము, ఇకముందు కూడా ఇదేవిధంగా పోరాటం చేసి వారికి సరియైన న్యాయం జరిగేవిధంగా చూస్తాం. నియోజకవర్గంలో సంచార జాతులకు చెందిన 3000 కుటుంబాలకు ఇప్పటి వరకు ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉంటుంది. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త, నాయకుడు కాంగ్రెస్ విజయం కోసం కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో షాద్‌నగర్ కాంగ్రెస్ కంచుకోట అని తప్పకుండా నిరూపిస్తాం.

**- వీర్లపల్లి శంకర్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, షాద్‌నగర్ నియోజకవర్గం.**



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు (పాతచిత్రం)

## రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న వారికి న్యాయం చేయాలి

**-మేడ్చల్ జడ్పీకాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ హరివర్ధన్‌రెడ్డి**
**-కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధితుల ధర్నా**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 30, ప్రభాతవార్త**
దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని బండ్లగూడ (అహ్మద్‌గూడ) రాజీవ్ గృహకల్పలో ఎన్నో ఏళ్లుగ నివాసం ఉంటున్న కుటుంబాల వారికి న్యాయం చేయాలని మేడ్చల్ జడ్పీకాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ ఎస్.హరివర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద రాజీవ్ గృహకల్ప బాధితులు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విచ్చేసి నిరసన తెలియజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ కాంగ్రెస్ నాయకురాలు ఈగ శ్వేత, జి.సరిత వెంకటేశ్ లతో పాటు పలువురు బాధితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగ కలెక్టరేట్ వద్ద హరివర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గృహకల్పలో ఎన్నో ఏళ్లనుంచి నివాసం ఉంటున్న పేదలను వెళ్లగొట్టి వేరే ప్రాంతాలలోని అధికార పార్టీ కార్యకర్తలకు ఆ గృహాలను కేటాయిస్తుండటంతో అందులో నివాసం ఉంటున్న పేదలు రోడ్డున పడుతున్నారని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నివాసాలు ఉంటున్న వారికే అందులో అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బయట వారికి ఆ ఇండ్లను



కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేసిన రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్న బాధితులు, పాల్గొన్న జడ్పీకాంగ్రెస్‌ఫ్లోర్‌లీడర్ హరివవర్ధన్‌రెడ్డి, పాల్గొన్న నాయకులు

కేటాయించటం ఎంత వరకు సబబు అని అన్నారు. పేదలను రోడ్డు పాలు చేయటానికే అధికార పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. ఈ విషయాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు వివరించామని న్యాయం చేయాలని కోరటం జరిగిందన్నారు. వెంటనే స్పందించి రాజీవ్ గృహకల్పలో ఇండ్ల కేటాయింపులను నిలిపివేయాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ అధ్యర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి మహిళా ప్రధాన కార్యదర్శి గోగుల సరితవెంకటేశ, దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సుమేశ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు సిరిసిల్ల శ్రీనివాస్, శామీర్‌పేట, తూంకుంట కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులు వై.శంకర్‌గౌడ్, బి.జైపాల్‌రెడ్డి, జిల్లా పార్టీ నాయకులు ఎం.మహేందర్‌యాదవ్, జగన్, బిక్షపతి, రాజు, ఎస్ రమేశ్, సత్యం, పాల్గొన్నారు.

## కీసరగుట్ట పార్కింగ్ ఫీజు అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు



కీసరగుట్టలో పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఆదిత్య ఆగస్త్య

**కీసర, జనవరి30, ప్రభాతవార్త:**
వచ్చే నెల ఫిబ్రవరి 16 నుండి 21వ తేదీ వరకు జరుగనున్న కీసరగుట్ట మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో పార్కింగ్ ఫీజు వసూలు చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ ఆదిత్య ఆగస్త్య హెచ్చరించారు. సోమవారం కీసరగుట్టలో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కీసరగుట్ట పై జంక్షన్ రోడ్డును వెంటనే వెడల్పు చేయాలని అధికారులకు తెలిపారు. కీసర పెద్దమ్మ చెరువు నుండి కీసరగుట్ట వరకు శాశ్వతంగా ఉండేలా ఎల్ఈడి లైట్లు వేయాలని ఏఈ అనిల్‌ను ఆదేశించారు. ఈ సారి విఐపి లైను ఒక్కటి మాత్రమే ఉంటుందని తెలిపారు. కీసరగుట్ట వరకు ఉన్న బిటి రోడ్డును మహాశివరాత్రి లోపు వేసి భక్తులకు అందుబాటులోకి తేవాలని ఏఈ జగపతి బాబుని ఆదేశించారు. పార్కింగ్ వేలం పాటను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, ఎంపిడిఓ రమాదేవి, ఎంపిపి మల్లారపు ఇందిర లక్ష్మీనారాయణ, ఎంపిఓ మంగతాయారు, ఆలయ చైర్మన్ తటాకం రమేష్‌శర్మ, ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి బెలిదె రమేష్‌గుప్తా పాల్గొన్నారు.

## రూ.50లక్షలతో గాడిబాయి శివాలయం అభివృద్ధి -ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**కొడంగల్, జనవరి 30ప్రభాతవార్త**
కొడంగల్ నియోజకవర్గ కేంద్రం శివారులోని పురాతన గాడిబాయి శివాలయాన్ని రూ.50లక్షలతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం శివాలయంలో శివస్వాములు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రూ.5లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... కొడంగల్ ప్రాంతంలో ప్రసిద్ది గాంచిన దేవాలయాలు ఉన్నాయని, ఇందులో భాగంగా చోళుల నాటి పురాతన దేవాలయంగా మహిమాన్వితమైన గాడిబాయి శివాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే శివరాత్రి నాటికి రూ.50లక్షలతో ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోనే అత్యంత పెద్ద శివలింగం కొడంగల్ పట్టణ శివారులోని గాడిబాయి శివాలయంలోనే ఉందన్నారు. అలాంటి ఆలయాన్ని అభివృద్ధి చేసుకునే బాధ్యత మనపై ఉందన్నారు. శివరాత్రి పర్వదినం రోజున ఆలయంలో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, శివదీక్ష చేసే భక్తులు దీక్ష ముగిసే వరకు ఆలయ ప్రాంగణంలోనే పూజలు చేయనున్నట్లు ఆలయ అర్చకులు కిట్టుస్వామి ఎమ్మెల్యేకు వివరించారు. పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులో లేకపోవడంతో స్పందించిన ఎమ్మెల్యే శివస్వాముల విజ్ఞప్తి మేరకు ప్రస్తుతం రూ.5లక్షలతో షెడ్ నిర్మాణానికి పూజ చేయడం జరి గిందని, త్వరితగతిన షెడ్ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆల య పరిసర ప్రాంతాల్లో ఉన్న అతి పురాతన బావిని పునరుద్దరించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు హైద్రాబాద్ రోడ్డులోని బండల ఎల్లమ్మ ఆలయం నుంచి గాడిబాయి శివాలయం మీదుగా బీటీ రోడ్డు మంజూరీ చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంధాలయ సంస్ధ చెర్మెన్ రాజుగౌడ్‌లను శివస్వాములు, ఆలయ అర్చకులు సన్మానించారు. అంతకుముందు శివస్వాములు బసవణ్ణలతో పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా స్వామివా రి పల్లకి సేవ ఊరేగింపుతో మహాదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, సర్పంచ్ సయ్యద్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.



గాడిబాయి శివాలయంలో షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

## పేకాట పేరుతో పీర్జాదిగూడలో అర్ధరాత్రి హంగామా

**ప్రజాప్రతినిధులను తప్పించారనే ఆరోపణలు .. మీడియా ప్రతిధులపై దాడులు**

**బోడుప్పల్, జనవరి 30 (ప్రభాతవార్త):**
పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయి ప్రియా కాలనీ చౌరస్తా వద్ద ఆదివారం అర్ధరాత్రి పేకాట పేరుతో హంగామా జరిగింది. పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్‌శివకుమార్ గౌడ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు పేకాట ఆడుతున్నారని సమాచారం అందటంతో ఎస్ఓటి పోలీసులు దాడి చేశారనే ప్రచారం జరుగడంతో తీవ్ర గందరగోళం జరిగింది. విద్యుత్ సరఫరా నిలిపివేసి అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులపై దాడి చేసి ప్రజాప్రతినిధులను తప్పించారనే ప్రచారం జరిగింది. ఈ విషయంలో డిప్యూటీ మేయర్ శివ కుమార్ స్పందిస్తూ తనకుగాని, ఇతర కార్పోరేటర్లకుగాని పేకాటతో సంబంధంలేదని తెలిపారు. తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేని కొందరు నాయకులు తనపైదుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. మీడియా ప్రదినిధులపై దాడిని ఖండిస్తూ మేడిపల్లి పోలీస్ స్టేషన్ ముందు విలేకరులు ధర్నా నిర్వహించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ పేకాట విషయంలో మేడిపల్లి పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రూ.1,60,680, రెండు సెల్ ఫోన్లతోపాటు ఒక సెట్ పేక



పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలియజేస్తున్న మీడియా ప్రతినిధులు

ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గాంధీనగర్‌కు చెందిన షేక్ నబీ(33), సాయి ప్రియా కాలనీకి చెందిన బోరెల్లి వీరేశం(55), సత్యనారాయణ పురానికి చెందిన పిట్టల కార్తీక్ (28), పర్వతాపూర్‌కు చెందిన ఎంపాల సత్తిరెడ్డి(48)లపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నర్సింగ్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

## సమయపాలన పాటించని అధికారులు !

**-కార్యాలయాల చుట్టు తిరుగుతు ప్రజల అవస్థలు !!**
**-సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చొరవ చూపాలి**

**పెద్దేముల్, జనవరి 30, ప్రభాతవార్త:** ప్రజలకు అధికారులు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పదేపదే ఆదేశిస్తున్న అధికారులు అవేమి పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా అధికారులు ఎవరు ఎప్పుడు వస్తారో ఎవరు ఎప్పుడో వెళతారో ప్రజలకు అర్థం కాలేక కార్యాలయాలు చుట్టు తిరుగుతు అవస్థలు పడుతున్నారు. కూలి పనులను మానుకొని కార్యాలయాలు చుట్టు చెప్పులు అరిగేలా తిరిగిన పట్టించుకునేనాథుడేలేరని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటు కూలి పనులకు వెళ్ళక, అటు కార్యాలయాలలో పనులు కాలేక సతమతమవుతున్నామని వాపోతున్నారు. సోమవారం ఉదయం 11=30 గంటలు దాటిన యంపిడిఓ, యంపిఓ కార్యాలయానికి రాలేకపోయారు. పించన్ల కోసం అడుగుదామని కార్యాలయానికి వచ్చిన, అధికారులు లేక తట్టెపల్లి, బండపల్లి, మంబాపూర్ తదితర గ్రామాల ప్రజలు వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఉదయం 11=30 గంటలు దాటిన వ్యవసాయ కార్యాలయము తెరువలేదు. మద్యాహ్నం 12=00 గంటలకు తెరిచిన వ్యవసాయ కార్యాలయము 3=00 గంటలకే మూసి వెళ్ళిపోయారు. మధ్యాహ్నం 12=30 గంటలు దాటిన మండల పశువైద్యాదికారి రాలేదు. ఇలా సమయపాలన పాటించని అధికారుల వల్ల ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు పర్యవేక్షించి సమయ పాలన పాటించని అధికారులపై చర్యలు తీసుకొని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న యంపిడిఓ కుర్చీ



వ్యవసాయ కార్యాలయానికి తాళము వేసిన దృశ్యం

## కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జనవరి 30, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. దీనిలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిఆర్ఓ లింగ్యానాయక్‌లు పాల్గొని ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. దీనిలో 65ధరఖాస్తులు, వినతులు, ఫిర్యాదులు అందినట్లు ఆయన తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి సూచించారు. ప్రజావాణిలో వచ్చిన వాటిని పెండింగ్‌లో పెట్టకుండ వెంటనే పరిష్కరించటానికి జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ లింగ్యానాయక్, పలువురు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించి మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిఆర్ఓ లింగ్యానాయక్, తదితరులు

# పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



చౌదరిగూడలో కాంగ్రెస్ పార్టీ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 30,(ప్రభాతవార్త):**
గ్రామ స్థాయి కార్యకర్త నుంచి మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం నిరంతరం కృషిచేయాల్సి న భాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు అన్నారు. సోమవారం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం లాల్‌పహాడ్ చౌరస్తాలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎపార్టీ అధికారంలోకి రావాలంటే ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే గ్రామాల్లో ఓటర్లను చైతన్యం చేయాలని అన్నారు. బీఆర్‌స్, బిజెపి పార్టీలు అవలంబిస్తున్న తీరును ప్రజలకు తెలియజెప్పాలని అన్నారు. రెండు పార్టీల వల్లన ప్రజలు ఎదుర్కోంటున్న ఇబ్బందులను వివరించారు. ప్రజల సమస్యల సాధన కోసం తమ పార్టీ కార్యకర్తలు సిద్దంగ ఉండాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ హయమంలో చేపట్టిన పనులు ప్రస్తుత పార్టీలు చేసిన పనులను ప్రజలకు వివరించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలు పూర్తి స్థాయిలో తీరుతాయని పెర్కోన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వెంకటనర్సి ంహారెడ్డి, మహిళ అధ్యక్షురాలు పిట్ట రజిత, నవీన్‌గౌడ్, శ్రీను, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రంలో రెండవ ట్రైనింగ్ బ్యాచ్ ప్రారంభం

**మొయినాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ రెవెన్యూలోగల దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రం యందు గత నెలలో ప్రారంభించిన ఉచితంగా మహిళలకు ఉపాధి కోరకు సెక్యూరిటి ఇన్‌ఫ్రాస్చర్ నందు మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. జనవరి 1 వతేదిన మొదటి బ్యాచ్ కోర్సు ప్రాంభించి రెండవ బ్యాచ్ ఫిబ్రవరి 1న ప్రారంభిస్తున్నట్లు, జిల్లా మేనజనర్ శిలా కుమారి ఒ ప్రకటనలో తెలిపారు. సెక్యూరిటి ఇన్‌ఫ్రాస్చర్ కోర్సులు 4 నెలల పాటు ట్రైనింగ్ ఇస్తామని, మంచి ఆహ్లాదకరమైన వాతవరణంలో ప్రాంగణం యందు ఉచిత భోజన వసతి సదుపాయం ద్వార ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆసక్తి కలిగి ఉచ్చిత కోర్సుల కోసం ధరఖాస్తు చేసుకున్న వారు ఫిబ్రవరి 1 వ తేదిన ఉదయం 10 గంటల వరకు చిల్కూర్‌లో ఉన్న దుర్గా బాయి మహిళ శిశు వికాస కేంద్రానికి వారి సర్టిఫికెట్‌లు జిరాక్స్ సెట్‌తో రావాలని తెలిపారు. ఈ కోర్సులు పూర్తియిన తరువాత మా ద్వార ఉద్యోగం పోందుటకు మేము సహయ సహకారాలు అందిస్తామని తెలిపారు, పూర్తి వివరాల కోరకు సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు, 7660022524, 8074735661 ఆఫీస్ టైమ్ ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:30 వరకు ఉంటుందని తెలిపారు.

## వెల్జాల్ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం

**తలకొండపల్లి జనవరి30,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామ హైస్కూల్‌లో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ వేడుకల్లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పాల్గొని విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్ ,పరమేష్, కార్యదర్శి శరత్, వార్డు సభ్యుడు యాదయ్య, వెంకటయ్య, శ్రీశైలం, కిరణ్ సాయి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యద్వారం నిర్మాణానికి భూమిపూజ



**తలకొండపల్లి జనవరి30,ప్రభాతవార్త :**
తలకొండపల్లి మండలంలోని దేవుని పడకల్ గ్రామ చౌరస్తా వద్ద దోకోరి ప్రభాకర్ రెడ్డి తండ్రి కీర్తిశేషులు రామ్ రెడ్డి జ్ఞాపకార్థం ముఖద్వార నిర్మాణానికి శాస్త్రృతంగా వేద బ్రాహ్మణులచే భూమి పూప నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మహబుబ్‌నగర్ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి, రాఘవేందర్ రెడ్డి, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలు శ్రీనివాస్‌రెడ్డిలు హాజరై భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ,ఆమగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

## ప్రపంచ కుష్టువ్యాధి దినోత్సవం



**మొయినాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో 2023 వ ప్రపంచ కుష్టువ్యాధి రహిత సమాజంగా ఏర్పాటులో భాగంగా సోమవారం కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తు ప్రతిజ్ఞా కార్యాక్రమాన్ని చిల్కూర్ గ్రామ సర్పంచ్ గునుగుర్తి స్వరూపా ఆండ్రూస్ మరియు మండల సామాజిక ఆరోగ్య అధికారి తోట నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వరూపా ఆండ్రూస్ మాట్లాడుతూ.... కుష్టువ్యాధి లక్షణాలను వెంటనే గుర్తించాలంటే శరీరంపై మచ్చలు ఏమైనా ఉన్నట్లైతే, వెంటనే మండల ఆరోగ్య కేంద్రానికి వెళ్లి శరీరం స్పర్శ ఉందా.లేదా అని పరీక్ష నిర్వహించుకోవాలని తెలిపారు. తోందరగా గుర్తించి చికిత్స తీసుకున్నట్లయితే, వ్యాధి నయమౌతుందని అన్నారు, అంతే కాకుండా మండలంలో మొయినాబాద్ గ్రామ పంచాయితీ మరియు చిల్కూర్ పంచాయితీలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యాక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిల్కూర్ సర్పంచ్ స్వరూపా ఆండ్రూస్, సిఎచ్‌వో. నర్సింగ్‌రావు, ఎచ్‌ఎస్. సునీత, ఉమా మహేశ్వరి, అంతులు అజీమ్, ఆరోగ్య కార్యాకర్తలు, స్వాతి, భారతి, కెవి. డాక్టర్లు, డా.సుష్మ, అశాకార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 30,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని లాల్‌పహడ్ వద్ద సోమవారం గుర్తు తెలియని శవం లబ్యమైనట్లు ఎస్ఐ సక్రం తెలిపారు. మృతుడు దాదాపు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. గీతల షర్టు, బ్లూ కలర్ ఫుల్ బనియాన్, బ్లూ కలర్ జీన్స్ దరించినట్లు వివరిం చారు. మృతుడి వివరాలు ఇప్పటి వరకు తెలియరాలేదని ఆయన పెర్కోన్నారు.

# గాంధీజీ అహింస మార్గం ప్రపంచానికే ఆదర్శం



మహాత్మ గాంధీ వర్థంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



ఆమనగల్లులో గాంధీజీ విగ్రహం ఎదుట నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు



ఆమనగల్లులో గాంధి విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే గుర్కా, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



షాబాద్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ మండలంలో**

**జిల్లెడు చౌదరిగూడ, జనవరి 30,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం మహాత్మ గాంధీ 75వ వర్ధంతి కార్యక్రమాన్ని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు హఫీజ్ మహాత్మ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మ గాంధీ స్వతంత్రం కోసం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడ వెంకటస్వామి, ఇస్మాయిల్, వెంకటేష్, మాణెయ్య, బాల్‌చంద్రయ్య, బాలయ్య, ప్రకాష్, మల్లేష్, బావయ్య, నరేష్‌గౌడ్, పాండు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

**ఆమనగల్లు మండలంలో**

**ఆమనగల్లు, జనవరి30, (ప్రభాతవార్త):** మహాత్మాగాంధి చూపిన అహింసా మార్గం విశ్వవ్యాప్తంగా ఆదర్శనీయంగా పేరుగాంచిందని ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల నేతలు అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బాపూజి ఎన్నో అవరోధాలను ఎదుర్కుని అహింసా మార్గంలో వాటిని పరిష్కరిస్తూ భారత స్వాతంత్ర్యం సాధించేందుకు కృషి చేశాడని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఆమనగల్లు గాంధి విగ్రహ నిర్మాణ దాత వీరబొమ్మ రాంమోహన్‌గుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గాంధీజి వర్ధంతి వేడుకలలో ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపిపి అనితవిజయ్, జడ్పిటిసి అనురాధపత్యనాయక్, వెల్దండ జడ్పిటిసి ద్యాప విజితారెడ్డి, నాయకులు పత్యనాయక్, దోనాదుల కుమార్, నిరంజన్‌గౌడ్, సయ్యద్ ఖలీల్, రమేశ్‌నాయక్, టి. రామకృష్ణ, గుత్తి బాలస్వామి, రూపం వెంకట్‌రెడ్డి, పూసలి భాస్కర్, కొమ్ము ప్రసాద్, జంతుక కిరణ్, గణేశ్‌నాయక్, వస్పుల రంజిత్‌లు పాల్గొన్నారు.

**ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో....**

బాపూజీ గాంధీ వర్దంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, గాంధీ విగ్రహ నిర్మాణ దాత వీరబొమ్మ రాం మోహన్ గుప్త ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై గాంధీజికి నివాళులు అర్పించారు. గాంధి చౌక్ వద్ద ఉన్న గాంధి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో వర్తక సంఘం అధ్యక్షుడు కండె పాండురంగయ్య, నటరాజ్‌యాదయ్యగుప్త, గణేశ్‌గుప్త, వెంకటేశ్‌గుప్త, బికుమాండ్ల నర్సింహ్మగుప్త, జూలూరి గోపాల్‌గుప్త, శేఖర్‌గుప్త, ఆనంద్ గుప్త, మేడిశెట్టి శ్రీధర్, కండెసాయి, ఉప్పల రాములుయాదవ్ తదితరులు ఉన్నారు.

**షాబాద్ మండలంలో**

**షాబాద్, జనవరి 30, ప్రభాతవార్త :** లౌకిక వాదాన్ని కాపాడుకుంటూ, దేశ సమగ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని షాబాద్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రామస్వామి, ప్రభులింగం, రైతు సంఘం రాష్ట్ర సమితి సభ్యులు సుధాకర్‌గౌడ్, పార్టీ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు రఘురాం, రుక్కయ్య, మధు, మల్లేష్ తదితరులు ఉన్నారు.

**కొత్తూర్‌లో**

**కొత్తూర్, జనవరి 30, ప్రభాతవార్త :** కొత్తూర్ పురపాలిక కేంద్ర పరిధిలోని పెంజర్ల బైపాస్ రోడ్డు వద్ద కౌన్సిలర్ మాదారం నర్సింహ్మాగౌడ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ 75వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కౌన్సిలర్ సోమ్లానాయక్, కౌన్సిలర్ అనితాశ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మాదారం అనురాధకృష్ణగౌడ్, మున్సిపల్ బూత్ కమిటీ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులు వెంకటేష్, దానషాప్ నవీన్‌గౌడ్, నాట్కో విష్ణు, మల్లేష్‌యాదవ్, ఎండీ పాష తదితరులు ఉన్నారు.

**షాద్‌నగర్‌లో**

**షాద్‌నగర్, జనవరి 30, (ప్రభాతవార్త) :** భారతదేశాన్ని బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి విముక్తిని చేయించిన గొప్ప స్వాతంత్ర్య యోధుడు, జాతిపిత అయిన మహాత్మ గాంధీజీని ఎన్నటికి మరువబోమని, ఆయన సేవలను భావి తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకొని టీడీపీ పార్టీ పట్టణ అధ్యక్షుడు గందం ఆనంద్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ విగ్రహానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నేకోట రమేష్, విఠ్యాల అంజయ్య, కందూరి అంజయ్యగౌడ్, పిడెం సత్యనారాయణ, దాసరి అనంతయ్య, బక్కని క్రిష్టయ్య, బక్కని శ్రీను, వేముల ఆంజనేయులు, రమేష్ కొండన్నగూడ, పిడెం రమేస్, గంటెల శంకరయ్య, కుడుముల యాదగిరి, దాసరి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

**యాచారంలో**

**యాచారం, జనవరి 30 ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు సోమవారం మండల కేంద్రంలో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి మహాత్మునికి నివాళులు అర్పించారు. శాంతి, సత్యం, అహింసలే ఆయుధాలుగా చరిత్రపై చెరగని ముద్ర వేసిన మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ సేవలు మరువలేనివని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు వీరబొమ్మల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఈ సందర్బంగా మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర మరువలేనిదంటూ ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ళ మండలంలో**

**చేవెళ్ళ, జనవరి 30, ప్రభాతవార్త :** ఏఐసిసి జాతీయ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర విజయవంతంగా ముగిసిందని రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి అన్నారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మగాంధీ వర్ధంతిని పుసస్కరించుకుని అయన చిత్ర పటానికి పూల మాలలు వెసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి మాట్లాడుతూ రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు చేపట్టిన యాత్ర విజయవంతంగా సాగిందని, పార్టీకి పూర్వవైభవం యాత్ర వలన సంతరించుకుందన్నారు. కాంగ్రేస్ పార్టీకి పూర్వవైభవం రావడం ఖాయమని, అధికార పార్టీకి గుబులు మొదలైందని, గ్రామాలల్లో కాంగ్రేస్ పార్టీ బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, సీనియర్ నాయకులు మల్లేష్‌యాదవ్, చేవెళ్ల మండల యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, ఉప సర్పంచ్ గంగియాదయ్య, మాజీ ఉప సర్పంచ్ టెకులపల్లి శ్రీనివాస్‌యాదవ్, నాయకులు బాలయ్య, హనీఫ్, దేవెందర్, ప్రశాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు.



మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కౌన్సిలర్



మహాత్మ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు



చేవెళ్ల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాత్మగాంధీ వర్ధంతిని పునస్కరించుకుని అయన చిత్ర పటానికి పూల మాలలు వెసి నివాళులర్పిస్తున్న రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి

# గ్రామాభివృద్ధికి శాయశక్తులా పాటుపడతా: ప్రశాంత్‌కుమార్

-అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత
-కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**యాచారం, జనవరి 30 ప్రభాతవార్త**
బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర సోమవారం 9వ రోజు మండలంలోని చిన్నతుండ్ల గ్రామంలో కొనసాగింది. యాత్ర సందర్భంగా ఆయన గడప గడపకు తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టినట్లు తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడానికి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడానికే ప్రగతి నివేదన యాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిధుల నుండి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. సీసీ రోడ్లు, బిటి రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజి, మిషన్ భగీరథ తాగు నీటి పైప్‌లైన్లు, మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ తదితర పనుల కోసం రూ.6.33 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ప్రతి నెలా సుమారు 246 మందికి ఆసరా పెన్షన్ల కోసం రూ. 5.46 లక్షలు, రైతుబంధు ద్వారా 622 మంది రైతులకు రూ. 97.02 లక్షలు, రైతు భీమా పథకం కింద 13 మ ంది రైతులకు దాదాపు రూ. 65 లక్షలు, సీఎం సహాయనిధి పథకం నుండి 21 మందికి రూ. 8.70 లక్షలు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద 814 మందికి దాదాపు రూ. 60 లక్షలు, 147 మందికి కెసిఆర్ కిట్‌లను ప్రభుత్వం అందజేసినట్లు తెలిపారు. గత 10 సంవత్సరాల క్రితం చిన్నతూండ్ల గ్రామం ఎలా ఉండేదో ప్రస్తుతం ఎలా ఉన్నదో ప్రజలు పరిశీలన చేయాలన్నారు. గ్రామంలో డ్రైనేజిలు, సీసీ రోడ్లు, ముదిరాజ్, యాదవ సంఘ భవనాలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లు నిర్మాణం చేయాలని ఆయా సంఘాల నాయకులు ప్రశాంత్‌కుమార్‌రెడ్డిని కోరగా తక్షణమే ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేయిస్తానని హామీ ఇచారు. గ్రామంలో పశు వైద్యాధికారి మూడు రోజులు అందుబాటులో ఉండేలా ఎమ్మెల్యేతో మాట్లాడి వెటర్నరీ డాక్టర్‌ను ఏర్పాటు చేస్తానన్నారు. పాఠశాలలో విద్యార్థులు భోజనాలు చేయడానికి సుమారు 100 స్టీల్ ప్లేట్లను ఎంకెఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేస్తామని, క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విద్యార్థులకు వాలీబాల్ కిట్‌ను, అదే విధంగా యువకులకు క్రికెట్ కిట్‌ను అందజేశారు. గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజి కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాధించే దిశగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ పాలన సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసి చిన్నోళ్ల జంగమ్మ యాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు కర్నాటి రమేష్‌గౌడ్, పిఎసిఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ సబిత ఆంజనేయులు, మాజీ సర్పంచ్ సత్యపాల్, గ్రామశాఖ అధ్యక్షుడు అంకని రమేష్, ప్రధాన కార్యదర్శి శంకర్, వార్డు సభ్యులు, పిఎసిఎస్ డైరెక్టర్ మక్కపల్లి స్వరూప, కొత్తపల్లి ఎంపిటిసి సమతమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి మల్లేష్, రాజశేఖర్‌రెడ్డి, ఆనంద్, మాజీ ఎంపిటిసి కృష్ణమూర్తి, నాయకులు రాజునాయక్, ఒరుగంటి యాదయ్యగౌడ్, బ ంటి యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

# మాకు పోటీ బీఆర్ఎస్ మాత్రమే.... జిల్లాలో కాంగ్రెస్ లేదు

- బిజెపి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి

**షాద్‌నగర్, జనవరి 30, (ప్రభాతవార్త) :**
రంగారెడ్డి జిల్లాలో మాకు బీఆర్ఎస్‌తోనే పోటీ తప్ప కాంగ్రెస్ పార్టీతో లేదని, ఏనమిది నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జాడలేదని, బలోపేతంగా లేదని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి సంచనల వ్యాఖ్యాలు చేశారు. అదే విధంగా పార్టీ నియమ నిబంధలను విరుద్దంగా, పార్టీ సిద్దాంతాలు దాటే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన సొంత పార్టీ వారిని సహితం గట్టిగా హెచ్చరించారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని బీజేపీ నియోజకవర్గ ఇంఛార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం మానేసిందని అభివృద్ధిని అధపాతాళానికి తొక్కేసి ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా రెవెన్యూ పరంగా అగ్రస్థానంలో ఉందని, ఏటా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నిధులు సమాకూర్చుతుందని అన్నారు. ఇలాంటి ధనిక జిల్లాలో ఒక లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని విస్మరించిందని విమర్శించారు. ఇప్పటి వరకు జిల్లాలో 10 వేల ఇండ్లు అవసరం ఉన్నాయని, అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 20 లక్షల ఇండ్ల అవసరం ఉంటే ఈ బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 12 వేల ఇల్లు మాత్రమే ఇచ్చారని ఆయన ఎద్దేవా చేశారు. జిల్లాకు సంబంధించిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు ఈ విషయమై మౌనం పాటిస్తున్నారో ప్రజలకు అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోయింది. ఇక షాద్‌నగర్ నియోజకవర్గంలో కూర్చీ వేసుకొని లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పూర్తి చేయిస్తానన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదు, రాబోయే బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా భవిష్యత్తు ప్రణాళికను సిద్ధంచేస్తున్నామని, ఫిబ్రవరి నుంచి జిల్లాలో ప్రభుత్వ వైఫల్యాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలను రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ స్థాయిలో పార్టీ పటిష్టత కోసం పూర్తిస్థాయిలో బలోపేతం చేస్తున్నామని ఆయన వివరించారు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలో భాగంగా బీజేపీ రాబోయే ఎన్నికలకు శ్రీకారం చుట్టబోతున్నామని అన్నారు. పార్టీకి కొన్ని సిద్ధాంతాలు ఉన్నాయని, వాటిని అతిక్రమించిన వారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని ఆయన సొంత పార్టీ నాయకులకు సహితం హెచ్చరికలు జారీ చేశారు. కొంత మంది సేవా కార్యక్రమాలు తమ సొంతంగా చేసుకోవచ్చని కానీ పార్టీ పేరుతో కాని పార్టీకి సంబంధించిన బాధ్యులతో కాని ఆయా కార్యక్రమాలు చేయకూడదని అన్నారు. బీజేపీ సిద్ధాంతాలు నచ్చకపోతే ఎవరైనా బయటికి వెళ్లిపోవచ్చని ఆయన నాయకులను హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నరసింహ్మారెడ్డి, తదితరులు

**నేడు షాద్‌నగర్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం.**

బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నేడు షాద్‌నగర్ లో 9.30లకు కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. సమావేశానికి మండల స్థాయి బాధ్యులతో పాటు నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి బాధ్యులు హాజరవుతారని ఆయన వివరించారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అనంతరం షాద్‌నగర్ నియోజకవర్గ ఇంఛార్జ్ శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... నేడు జరిగే కార్యవర్గ సమావేశంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి అవసరమైన సాగునీటి సమస్య తీర్చడానికి చేపట్టాల్సిన లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టుపై తీర్మానం ఉంటుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన నేటికి ఆ హామీ నేరవేర్చాలేకపోయిన ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో ఈ సమస్యపై బీజేపీ పార్టీ పెద్ద ఎత్తున పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు ఆశోక్ గౌడ్, చెంది మహేందర్‌రెడ్డి, అందే బాబయ్య, కక్కునూరి వెంకటేష్‌గుప్త, మల్చరం మురళీ, చెట్ల వెంకటేష్, వంశీ, అడ్వకేట్ మనోహార్‌రెడ్డి, నరసింహాగౌడ్, కుర్మయ్య, ఋుషికేష్, నరసింహాయాదవ్, ఎంకనోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

## చెన్నకేశవ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతం



**తలకొండపల్లి జనవరి30,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమానికి బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి శ్రీనివాస్ యాదవ్ 21వేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ నూకం శేఖర్, అంజయ్య గుప్తా, బిఆర్ఎస్ అధ్యక్షుడు అంజయ్య, రాంపూర్ ఆలయ చైర్మన్ శ్రీశైలం యాదవ్, యాదయ్య, హరిమోహన్ రెడ్డి, మల్లేష్, మధు, సజ్జు పాషా, మధు యాదవ్, శ్రీరాములు, ఆంజనేయులు, మల్లేష్ వెంకటయ్య, యాదయ్య, రామ చంద్రయ్య, నర్సి ంహ, మల్లేష్, చెన్నయ్య, కృష్ణయ్య, రమేష్, పాల్గొన్నారు.

## జూలపల్లి రజక అభివృద్ధి సంస్థ గ్రామ అధ్యక్షుడిగా వేణు ఎన్నిక

**తలకొండపల్లి జనవరి30,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల పరిధిలోని జూలపల్లి గ్రామంలో రజక అభివృద్ధి సంస్థ గ్రామ నూతన కమిటీని మండల అధ్యక్షుడు కల్వకోలు యాదగిరి సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రెటరీ జనసీల శ్రీనివాస్ ,కందుకూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న రజక బందుమిత్రులందరూ కలిసి కట్టుగా పని చేయాలి మనం ఐక్యమత్యంగా ఉంటేనే ప్రభుత్వం రాజకీయ పార్టీలు కానీ మనల్ని గుర్తియని అన్నారు. కాబట్టి మనమంతా ఐక్యమత్యంగా ఉంటేనే దేనికైనా సాధించగలుతామన్నారు. రజకుల అభివృద్ధికి ముఖ్యమంత్రి కెసిఆర్ రజక ఫెడరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల రూపాయలు కేటాయించి రజక యువకుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. జూలపల్లి గ్రామ అధ్యక్షుడిగా కల్వకోలు వేణు, ఉపాధ్యక్షుడిగా కల్వకోలు శ్రీను, ప్రధాన కార్యదర్శి కల్వకోలు జంగయ్య, కార్యదర్శి శ్రీరాములు, కోశాధికారి కల్వకోలు శ్రీను, ప్రచార కార్యదర్శి కల్వకోలు శివ, తట్టెపల్లి సత్తయ్య, కల్వకోలు యాదయ్య, సాయిలు, వెంకటేష్, శ్రీశైలం, పాండు ,సందీప్, జంగయ్య, పెద్ద జంగయ్య, సాయి, సింహాద్రి, కార్తిక్ ,లక్ష్మ య్య, ఈశ్వరయ్య, శ్రీను, బాలయ్య, నర్సి ంహ్మ, శివశంకర్, నరేష్‌లను ఎన్నుకున్నారు.

## కంటి వెలుగుతో పేదల జీవితాల్లో కాంతి : ఎంపిపి

**కొత్తూర్, జనవరి 30, ప్రభాతవార్త :** కంటి వెలుగు కార్యక్రమం పేదల జీవితాల్లో కాంతి నింపుతుందని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తూర్ మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో సర ్పంచ్ అజయ్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ఎంపీపీ పిన్నింటి మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కంటి వెలుగుతో పేదల జీవితాల్లో కాంతిని నింపుతుందని, కాబట్టి సీఎం కేసీఆర్ మానస పుత్రిక అయిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. దేశంలో ఎక్కడలేని సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయని ఈ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ, లింగంనాయక్, ఉపసర్పంచ్ శ్రీరాములుయాదవ్, గోపాల్‌యాదవ్, డాక్టర్ హరికృష్ణ, ఎంపీవో నరసింహ, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

## రాగూరు పాఠశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌కు ఘన సన్మానం

**షాద్‌నగర్, జనవరి 30, (ప్రభాతవార్త) :**
షాద్‌నగర్ పట్టణంలోని రాగూరు పాఠశాల చైర్మన్ రాజేంద్రప్రసాద్‌కు తెలంగాణ గాంధీ స్మారక నిధి వారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. సోమవారం పట్టణంలోని రాగూరు పాఠశాలలోని ఆడిటోరియంలో మహాత్మ గాంధీ 75వ వర్థంతిని పురస్కారించుకొని విధూషన్ అవార్డు పొందిన రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను సహితం అందజేశారు. ఈ సందర్బంగా అవార్డు పొందిన రాజేంద్రప్రసాద్‌ను పలువురు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్మారక నిధి అధ్యక్షుడు భూదాన్ సుబ్బారావు, సెక్రెటరీ రంగారావు, ప్రొఫెసర్ వి.సుబ్రహ్మణ్యం, సభ్యులు బాపిరాజు, రామచందర్, స్వామి, పాఠశాల నిర్వహకులు రవిప్రకాష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## హరహర శంభో...శంభోమహాదేవ

**-భారీ ఊరేగింపుతో శివపార్వతుల విగ్రహాలు**

**-అట్టహాసంగా ప్రారంభమైన వేడుకలు**



శివాలయంలో వినయాక విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు బుగ్గోని గూడలో దేవతమూర్తుల ఊరేగిపు దృశ్యం

**నందిగామ జనవరి.30,ప్రభాతవార్త :**

నందిగామ మండలం బుగ్గోనిగూడలో శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట ప్రారంభ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైయ్యాయి.బుగ్గోనిగూడ భక్తబృందం-గ్రామప్రజల ఆధ్వర్యంలో మొదటి రోజు సోమవారం శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేక వాహనంలో డిజె సౌండ్ సిస్టకు మధ్య భక్తి పాటలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.చిన్న,పెద్ద,ముసలి ముతక వయోబేదం లేకుండా ఊరేగింపులో పాల్గొన్నారు.మహిళలు బతుకమ్మ పాటలతో ఆడగా యువకులు ఆధాత్మిక భక్తి పాటల మధ్య ఆడుతూ భక్తి భావాన్ని చాటుకున్నారు.గ్రామ పురవీధులను మామిడి తోరణాలు కటి అందంగా అలంకరించగా ,వీధుల్లో భక్తి పాటలతో హోరెత్తించారు.మూడు రోజుల పాటు,కొనసాగే ఈ వేడుకలతో బుగ్గనిగూడలో ఆధ్యాత్మిక వాతావ రణం నెలకొంది.ఈ వేడుకలో సర్పంచ్ బండి నీలమ్మ రాజు,ఉప సర్పంచ్ బుగ్గ స్వరూప శ్రీనివాస్,హనుమాన్,విగ్రహాదాత,ఆంజనేయులు,బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బుగ్గ నర్సింహ్మా,సాలయ్య,రేడ్డమోని శేఖర్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుగ్గ శ్రావణ్,డైరెక్టర్ బండి మల్లేష్,వార్డు సభ్యులు బుగ్గ రాధిక రవి,గుల్ల రాంచెంద్రి,బుగ్గ నీరజ నరేందర్,బుగ్గ అనిల్,బుగ్గ భాస్కర్,బుగ్గ శ్రీనివాసులు,అనంతయ్య,కృష్ణ,బుగ్గోని గూడ గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

### ఉమెన్స్ లీడర్‌షిప్ నేషనల్ అవార్డుకు ఎంపికైన దేవి పాండు

**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త:** వివిధ రంగాలలో విషిష్ట సేవలు అందించిన పులిమామిడి మాజీ సర్పంచ్ అనెగోని దేవి పాండుగౌడ్‌కు ఉమెన్స్ లీడర్‌షిఫ్ నేషనల్ అవార్డ్ 2023 ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ ప్రకటించింది. ఈ పత్రాన్ని సోమవారం అకాడమీ అధ్యక్షులు రాదాక్రిష్ణ, ప్రధాన కార్యదర్శి డా సుబ్రమన్యంల చేతుల మీదుడా అందుకున్నారు. ఈ సందర్బంగా దేవి పాండుగౌడ్ మాట్లాడుతూ... ఈ అవార్డు బాధ్యతలను మరింత పెంచిందన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ద్వారా లబించే ప్రోత్సాహకాన్ని తీసుకుని ప్రజలకు మరింత సేవలుఅందిస్తానని తెలిపారు. ప్రజా సేవలో నిబద్దతగా సేవచేయడం అనందంగా ఉంటుందని తెలపారు ఈ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ప్రజలకు ప్రత్యేక అబినందనలు తెలిపారు

## బిజెపి బలోపేతానికి కృషి చేయాలి

**-ఎమ్మెల్యే ఈటల రాజేందర్**



**నాగారం జనవరి30,ప్రభాతవార్త :** బిజెపి బలోపేతానికి కృషి చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పేర్కొన్నారు.నాగారం మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షుడు బుద్ధవరం వేణుగోపాల్ ఆధ్వర్యంలో పలువురు టిఆర్ఎస్ నాయకులు,ఉద్యమకారులు సోమవారం బిజెపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మామిడి జంగారెడ్డి,చంద్ర యాదవ్,మాజీ ఎంపిటిసి కుసుమాల మారేష్,తోట ప్రభాకర్,మల్ రెడ్డి,సతీష్ రెడ్డి,చెట్ల రమేష్ ముదిరాజ్,దాసరి నరసింహా రెడ్డి,దాసరి శ్రీధర్ రెడ్డి ,పాశం బిక్షపతి,గుండాల గోపాల్ గౌడ్,కురుమిళ్ల సురేందర్ గౌడ్,మామిడి చంద్రశేఖర్‌లు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి,జిల్లా కార్యదర్శి శ్యాసుందర్, మున్సిపల్ అధ్యక్షుడు వేణుగోపాల్ ,బొమ్మడి బుచ్చిరెడ్డి,నక్క కిషోర్ గౌడ్,తరిగొప్పుల బలరాం,రామక్కపేట రవీందర్ రెడ్డి,రామగోని రాకేష్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## బిటి రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన



**తలకొండపల్లి జనవరి30,ప్రభాతవార్త :**

తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో గల బిటి రోడ్డు మరమ్మతుల కోసం 56.75 లక్షల రూపాయల మంజూరు కావడంతో సోమవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించేందుకు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్ల కోసం అధిక నిధులు కేటాయిస్తుందని అన్నారు.వెంకటాపూర్ గేట్ నుంచి దేవుని పడకల్,చౌలపల్లి,గ్రామాల వరకు బిటి రోడ్డు మరమ్మతులకు నోచుకోవడంతో 56.75 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు.కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మరమ్మతుకు నోచుకున్న బిటి రోడ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గోలి శ్రీనివాస్ రెడ్డి,ఎంపిడివో శ్రీకాంత్,తహసీల్దార్ కృష్ణ,సర్పంచ్‌లు రమేష్,సక్రి కిషన్,సోనీ,మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్,ఎంపిటిసిల సంఘం మండల అధ్యక్షుడు జోగు రమేష్,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్,ఓరుగంటి వెంకట రెడ్డి,మాజీ సర్పంచ్ శంకర్ నాయక్,శ్రీనివాస్ రెడ్డి,దోకుర్ ప్రభాకర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

### అహింస పద్ధతితో దేశానికి స్వాతంత్రం సాధించిన మహాత్మాగాంధీ

**బొంరాస్‌పేట్,జనవరి30,ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల విద్యావనరుల కేంద్రం అవరణలో ఉపాధ్యాయులు మహత్మాగాంధీ విగ్రహంకు పూలమాలవేసి వర్ధంతి కార్యక్రమంను నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అహింస పద్దతిలో ఆంగ్లేయుల పాలన నుండి భారత దేశానికి మహాత్మాగాంధీ స్వతంత్రం సాధించారని అన్నారు.ప్రజలు అయనను మహత్ముడు,జాతిపిత అని గౌరవిస్తారన్నారు.ఉప్పు సత్యాగ్రహం,సహాయనిరాకరణతోపాటు అనేక ఉద్యమాలనుఅయన నిర్వహించారు. అయనను జనవరి 30వ తేది 1948న ఢిల్లీలోని బిర్లా నివాసం వద్ద ప్రార్థన సమావేశానికి వెళుతుండగా అయనను కాల్చిచంపడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జిఎచ్ఎం పాపిరెడ్డి,శ్రీహరిరెడ్డి,తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు రవీందర్‌గౌడ్, అనిల్‌కుమార్, చంద్రశేఖర్, లక్ష్మి,శ్రీప్రియ,అనురాధ,షశివర్ధన్,ఆలీవేలు,అంజురాథోడ్,సిఆర్‌పిలు నర్సిములు,గౌస్,సేవ్య,ఈశ్వర్,వేణుగోపాల్ పాల్గొన్నారు.

# జవాబుదారీతనం బాధ్యతగా గుర్తించాలి



కందుకూరు మండల సర్వసభ్య సమావేశంలో పాల్గోన్న జెడ్పిచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

**జెడ్పిచైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి**

**కందుకూరు, జనవరి 30, ప్రభాతవార్త:**

ప్రజాహితం కోసం ప్రజాప్రతినిధుల నుండి వచ్చే ప్రతి వినతికి అధికారులు జవాబుదారిగా నిలవాలని అది బాధ్యతగా గుర్తించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డా తీగల అనితాహరినాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కందుకూరు మండలంలో ఎంపిపి మంద జ్యోతి పాండు అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు... ప్రతి మూడు నెలలకు ఒక సారి జరిగే ఈ మండల సర్వసభ్య సమావేశాలలో మండలంలో గ్రామాల వారిగా నెలకొన్న సమస్యలు ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైన సమీక్షించుకోవలసిన అవసరం ఉంటుందన్నారు. ఈ సమయంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తే అంశాలపైన దృష్టి పెట్టాలని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత సమావేశాలలో ఏయే సమస్యలు సభదృష్టికి వచ్చాయి వాటి ప్రగతి నివేదికలను మళ్లి సమావేశాలు జరిగిన సమయంలో సభ ముందు ఉంచాలన్నారు. దానికోసం పెన్నుపెట్టి ప్రత్యేక డైరీ ఏర్పాటు చేసుకుని శాఖల వారిగా అధికారులు నోట్‌చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని జవాబుదారిగా నిలవాలన్నారు. ఎవరి బాధ్యతలు వారు నిర్వర్తిస్తే ప్రజాసమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటివెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలలో అవగాహన పెంచాలని సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైన గ్రామాల వారిగా ఉండే సమస్యలను గుర్తించి వాటికి సంబందించిన నివేదికలు అక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని వచ్చే బర్జెట్ నాటికి వాటిని పాలకులముందకు తీసుకోని వచ్చేలా చూడాలని సూచించారు. సమావేశాలకు సంబందిత శాఖల ముఖ్య అధికారులు తప్పని సరిగా రావాలని సమావేశాలకు వచ్చే అధికారులు కొత్తగా వచ్చాం సమస్యపైన అవగాహన లేదని తప్పించుకోరాదన్నారు. కొత్తగా వచ్చినవారు ఎక్కువ శ్రమ చేయాలని సూచించారు. సమావేశాల పట్ల నమ్మకం కల్పించేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు సజావుగా సకాలంలో ప్రజలకు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు జరిగిన అంశాలవారి చర్చలో ఎక్సైజ్ శాఖ పద్దుపైన జరిగిన చర్చ సందర్భంగా గ్రామాల వారిగా బెల్టు శాపులు పెరిగి పోతున్నాయని ప్రజలు తీవ్రగా నష్టపోతున్నారని కుటుంబ సమస్యలు పెరిగిపోతున్నాయని సంబంధిత శాఖ అధికారులే బెల్టు శాపులను ప్రోత్సహిస్తున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని అది చాలదన్నట్లు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేస్తున్నారని బెల్టు శాపులవారిని ప్రజా ప్రతినిదులపైకి పురమాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేవారు. దానికి సంబందించి సబాధ్యక్షులు సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వారం రోజులలోగా మండల వ్యాప్తంగా ఉన్న బెల్టు శాపులను నిర్మూలించేలా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్ఐ సభాముకంగా తెలిజయేశారు. ఈ సందర్బంగా విద్యుత్ శాఖ పద్దుపైన చరిగిన చర్చ సందర్బంగా గ్రామాలలో నిర్మించిన స్మశాన వాటికల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలని అదేవిదంగా నీటివసతి ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. విది నిర్వహనలో నిర్లక్ష్యం వహిస్తున్న జైత్వారం రేషన్ డీలర్‌పైన చర్యలు తీసుకోవాలని స్తానిక సర్పంచ్ సభాముకంగా పిర్యాదు చేశారు. గ్రామాలకు సకాలంలో బస్సులు రాక పొవడం వలన అయా ప్రాంతాలకు చదువుకోవడానికి వెల్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటు న్నారని సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అరోగ్య శాఖ వారు నిర్లక్ష్యం విడనాడాలని సబ్యులు సూచించారు. రెవెన్యూ సంబంధించి ఎదురవుతున్న సమస్యలను సత్వరం పరిష్కరించాలని పెద్దసర్వేనెంబర్‌లలో కొంత బాగంన సమస్యఉంటే అసమస్య అనెంబరుకంతటికి చూపుతున్నారని ఎవరి బాగం వారికి ఉంటుందని సమస్యలు ఎవరికివారిగానే గుర్తించాలనిసభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి బొక్క జంగారెడ్డి, ఎఎంసి చెర్మెన్ యస్ సురేందర్‌రెడ్డి, పిఏసిఎస్ చేర్మెన్ డి చంద్రశేఖర్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపిడిఓ వెంకట్రాములు, అయా శాఖల అధికారులు ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

## మా సారును బదిలీ చేయొద్దంటూ పాఠశాల ముందు విద్యార్థుల దర్నా



పూడూరు మండలం మేడిపల్లి కలాన్ ప్రాథమిక పాఠశాలముందు దర్నా చేస్తున్న విద్యార్థులు

**పూడూరు, జనవరి 30, ప్రభాతవార్త :**

మా సారు మాకేకావాలి.మా సారును బదిలీ చేయొద్దంటూ సోమవారం పాఠశాలముందు విద్యార్థులు దర్నా చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళితే పూడూరు మండలం పరిధిలోని మేడిపల్లి కలాన్ గ్రామంలో గత 12 సంవత్సరాలుగా ఖాజామోయినోద్దీన్ అనే ఉపాధ్యాయుడు ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రాధానోపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు.తాను విధుల్లో చేరిననాటి నుండి విద్యార్థుల యొక్క మనస్తత్వాలకు అనుగుణంగా, తోటి ఉపాధ్యాయుల సమన్వయంతో విద్యాబోధనలు చేయిస్తూ విద్యార్థులతోపాటు గ్రామస్తుల మనస్సును దోచుకున్నాడు. అయితే ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయడంతో సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఖాజామోయినోద్దీన్ వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లనున్నట్లు తెలుసుకున్న పాఠశాల విద్యార్థులు మాసారును బదిలీ చేయొద్దని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ తీసిన అనంతరం పాఠశాల మేయిన్ గేట్‌వద్ద దర్నాకు దిగారు.గ్రామ పెద్దలు అక్కడికి చేరుకొని ఎంత నచ్చచెప్పినా విద్యార్థులు వినకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇవ్వగా మధ్యాహ్నం దర్నాను విరమించారు.ఇదిలా ఉండగా ఈ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు ఉండగా ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా చదువులు కొనసాగించేందుకు కృషిచేస్తున్న ఇక్కడి ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయొద్దని కోరుతూ పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి,పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ బి రవి,బిఆర్ఎస్ పార్టీ నాయకులు టి నర్సింలు,వెంకట్‌రెడ్డి,నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్ పంపిణీ



**చౌడాపూర్ జనవరి30,ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చౌడాపూర్,మందిపాల్,మరికల్ ,కొత్తపల్లి,చాకల్‌పల్లి గ్రామాలలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్స్‌ను డిసిసిబి చైర్మన్ బి.మనోహర్ రెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో 10వ.తరగతి చదువుతున్న పేద,మధ్యతరగతి విద్యార్థుల కొరకు రానున్న 10వ తరగతి పరీక్షల దృష్ట్యా స్టడీ మెటిరియల్స్ అందిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని పరిగి నియోజకవర్గంలోని దాదాపు 4650 మంది పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటిరియల్స్‌ను బిఎంఆర్ ఫౌండేషన్ ద్వారా అందించడం సంతోషంగా ఉందని మనోహర్ రెడ్డి తెలిపారు.విద్యార్థులు,యువతకు ఉద్యోగాల శిక్షణ కేంద్రాలు ఏర్పాటులో గాని విద్యాపరమైన సేవలకు ఎల్లప్పుడూ ముందుంటానని బిఎంఆర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కమతం శ్రీనివాస్ రెడ్డి,జడ్పిటిసి రాందాస్,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి,పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాగరాజు,ఎంపిటిసి ఫోరం అధ్యక్షుడు రాంలాల్, సర్పంచ్‌లు రంగారెడ్డి ,మఠం ప్రమీల చంద్రశేఖర్,శేఖర్,నాయకులు రాజశేఖర్ ,శంకర్,శ్రీకాంత్ రెడ్డి,రాజప్ప,నర్సింలు,శివ కుమార్,వివిధ గ్రామాల సర్పంచ్‌లు,ఎంపిటిసిలు,ఉపాధ్యాయులు,విద్యార్థులు,నాయకులు పాల్గొన్నారు.

## సెంటర్లను విడిచి మండల కార్యాలయానికి అంగన్‌వాడి టీచర్లు రాక



అంగన్‌వాడి టీచర్లతో మాట్లాడుతున్న తహసిల్దార్

**-తాము పిలవలేదంటు తహసీల్దార్ చెప్పడంతో వెనుదిరిగిన అంగన్‌వాడి టీచర్లు**

**-సమాచారం లోపంతో కాలయాపన చేస్తున్న, పట్టించుకోని సంబంధిత అధికారులు**

**పెద్దేముల్, జనవరి 30, ప్రభాతవార్త:**

పిల్లలకు విద్యాబుద్దులు నేర్పి సరియైన పౌష్టికాహారం ఇవ్వాలని ప్రభుత్వం లక్షలాది రూపాయిలను ఖర్చు చేస్తున్న సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా లక్ష్యం నీరుగారిపోతోంది. ఉదయం 10=00 గంటలకు తెరిచి సాయంత్రం 4=00 గంటలకు అంగన్‌వాడి సెంటర్లను మూయాలని నిబంధనలు ఉన్నా వాటిని పట్టించుకోకుండా అక్కడక్కడ మద్యాహ్నం 3=00 గంటలకే మూసివేసి వెళుతున్నారు. ఉదయం 10=00 గంటలకు అంగన్‌వాడి కేంద్రాలలో ఉండవలసిన టీచర్లు 11=00, 12=00 గంటలకు వస్తున్నారు. సోమవారం సుమారు 15 సెంటర్ల అంగన్‌వాటి టీచర్లు వారి సెంటర్లను విడిచి మండల కార్యాలయానికి వచ్చారు. మండల కార్యాలయానికి ఎందుకు వచ్చారని అడుగగా తహసిల్దార్‌కు తమ తమ గ్రామాల సమాచారం ఇవ్వాలని, అందుకు వచ్చామని చెప్పారు. తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డిని అడుగగా అంగన్‌వాడి టీచర్లకు తాము ఎటువంటి సమాచారం ఇవ్వలేదని,వారు ఎందుకు వచ్చారో తమకు తెలియదని అన్నారు. ఇలా సమాచార లోపం వల్ల అంగన్‌వాడి టీచర్లు వారి సెంటర్లను వదలి మండల కార్యాలయానికి వచ్చిన సంబందిత అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే అంగన్‌వాడి సెంటర్లను ఇష్టానుసారంగా కొనసాగిస్తున్నారని పలువురు మండి పడుతున్నారు.

## శివయ్య మహా పడిపూజలు



**పరిగి జనవరి30,ప్రభాతవార్త :** పరిగి నియోజకవర్గంలో డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ద్వాదశ జ్యోతి లింగ మహపడిపూజ నిర్వహించారు.స్థానిక స్వాములు,భక్తులు,పరిగి పరిసర గ్రామాల శివ స్వాములు వేల సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.పరమశివుని దీవెనలతో పరిగి ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని డిసిసి అధ్యక్షుడు టి.రామ్మోహన్ రెడ్డి కోరుకున్నారు. పూజ కార్యక్రమంలో పరిగి నియోజకవర్గంలోని వివిధ గ్రామ సర్పంచ్‌లు,ఎంపిటిసి,ప్రజలు,శివ స్వాములు పాల్గొన్నారు.

### గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : చెర్మన్ రాజుగౌడ్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్

**కొడంగల్,జనవరి 30ప్రభాతవార్త**

విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు దోహదపడుతు సరస్వతి నిలయాలైన గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని జిల్లా గ్రంథాల సంస్థ చెర్మెన్ రాజుగౌడ్ అన్నారు.సోమవారం పట్టణంలోని సంతజారులో నూతనంగా నిర్మిస్తున్న కొడంగల్ గ్రంథాలయ భవనాన్ని సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు విద్యార్థులు,యువకులకు విద్యతో పాటు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు రూపకల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరీ చేయడం జరుగుతుందన్నారు.కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని గ్రంథాలయ భవనం పూర్తిగా శిధిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహకారంతో రూ.50లక్షల వ్యయంతో కొడంగల్ గ్రంథాలయం నూతన హంగులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు.నూతన గ్రంథాలయ భవనం ప్రోరంబోత్సవ అనంతరం గ్రంథాలయానికి వచ్చే విద్యార్దులు,యువకులు,మహిళలు,పాఠకులకు ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో కూడిన భవనం ఉందని,అలాగే నూతన భవనానికి తగ్గట్లుగానే గ్రంథాలయానికి విచ్చేసే పాఠకులకు ఉపయోగకరంగా ఉండే విధంగా పుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని,త్వరలోనే ప్రారంబోత్సవానికి ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్,సర్పంచ్ సయ్యద్ అంజద్,కాంట్రాక్టర్ అబ్బు తదితరులు పాల్గొన్నారు.

## దర్గాను దర్శించిన ఎమ్మెల్యే

**-నేడు తుంకిమెట్లలో మన ఊరు..మన ఎమ్మెల్యే**

**బొంరాస్‌పేట్,జనవరి30,ప్రభాతవార్త :**

బొంరాస్‌పేట్ మండలం మద్దిమడుగుతాండలోని దర్గాను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.చందులాల్ నాయక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు యాదగిరి,విష్ణువర్ధన్‌రెడ్డి,మాధుసుదన్‌యాదవ్,వైస్ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ దక్యానాయక్,నేహ్రూనాయక్,రమేష్,రాజు,బాబ్యానాయక్ పాల్గొన్నారు.

**-తుంకిమెట్ల గ్రామంలో నేడు మన ఊరు..మన ఎమ్మెల్యే కార్యక్రమం :**

ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బొంరాస్‌పేట్ మండలం తుంకిమెట్ల గ్రామంలో మన ఊరు..మన ఎమ్మెల్యే కార్యక్రమంలోభాగంగా మంగళవారం నాడు పర్యటన ఉంటుందని,ముదిరాజ్ భవనంకు భూమిపూజ కార్యక్రమంలో పాల్గోంటారని ఎమ్మెల్యే వ్యక్తిగత సహయకులు శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు,జడ్‌పిటీసి,ఎంపిపి,ఎంపిటీసిలు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,డైరెక్టర్లు, రైతుబంధు అధ్యక్షులు,సర్పంచ్‌లు,బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అయన కోరారు.



పూజలో పాల్గోన్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి.

### యువకులు క్రీడలు ఆడితే క్రమశిక్షణ అలవర్చుకుంటారు

**మొయినాబాద్ సిఐ డి.కె.లక్ష్మిరెడ్డి**



**మొయినాబాద్, జనవరి 30,ప్రభాతవార్త :**

యువకులు క్రీడలు ఆడితే క్రమశిక్షణ అలవర్చుకుంటారని మొయినాబాద్ మండల సిఐ డి.కె.లక్ష్మిరెడ్డి, అన్నారు. ఆదివారం మండలంలోని సురంగల్ గ్రామంలో నిర్వహించినటువంటి, ప్రిమియర్‌లీగ్, క్రికెట్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్యఅతిథిలుగా హజరయ్యారు, సురంగల్ గ్రామంలో బ్యాగరి బాబయ్య, వారి కోడుకు యాదయ్యల గారి జ్ఞాపకార్ధంతో తెలంగాణ ఆగ్రో రైతు సేవాకేంద్రం ఆధ్వర్యంలో క్రికెట్ ప్రిమియర్‌లీగ్ టోర్నమెంట్‌ను నిర్వహించారు, ఈ టోర్నమెంట్‌కు మొత్తం గ్రామం నుండి 8 జట్టులు పాల్గొన్నాయి, ఇందులో నుండి ఫైనల్‌కు ఈగల్ టీమ్, ఆర్.కె టీమ్‌లు ఫైనల్‌లో తలబడ్డాయి, ఇరుజట్టులు హోరాహోరిగా గెలుపుకోసం పోటీపడ్డాయి, ఫైనల్ విన్నర్‌గా ఈగల్ టీమ్ గెలుపోంది, షీల్డ్ అందుకోని 5 వలే రూపాయల నగదు బహూమతి కైవసం చేసుకుంది, ఆర్.కె టీమ్ రెండో స్తానంలో నిలుచి, రన్నరప్ షీల్డ్ మరియు 3 వేల రూపాయల నగదు బహుమతిని అందుకుంది, 3వ స్తానంలో రైసర్స్ జట్టు నిలిచి 2వేల నగదు దక్కించుకుంది. సిఐ లక్ష్మిరెడ్డి ఆయా టీమ్‌లకు బహుమతులు ఆయన చేతుల మీదుగా అందజేశారు, అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో యవన దశ ఎంతో ప్రాముఖ్యమైనదని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే మీ జీవితాలకు మీరు తానీషలుగా ఉంటారని, అన్నారు, నేటి సమాజంలో యువతకు క్రమశిక్షణ ఎంతో అవసరమని ఏదైనా క్రమశిక్షనతో శిక్షణ చేస్తే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామని అన్నారు, మంచిగా శ్రద్దగా చదువుకోని ఉన్నతులుగా ఎదిగినప్పుడు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉంటామని అన్నారు, గెలుపొందిన, టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించి, ఆటల్లో గెలుపోటములు సహజమని, నిజమైన గెలుపు జీవితంలో మనం అనుకున్న లక్ష్యాలను చేరుకున్నపుడే మనకు దక్కుతుందని, యువత మత్తుకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ టోర్నమెంట్ ఏర్పాటుచేసిన తెలంగాణ ఆగ్రో రైతు సేవాకేంద్రం వారిని అభినందించారు, ఈ కార్యక్రమంలో నిర్వహకులు బి.వినోద్, గ్రామ యువకులు క్రికెట్ ఆటగాలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

### అడుక్కుంటే హక్కులు రావు..కొట్లాడితేనే వస్తాయి

**బొంరాస్‌పేట్,జనవరి30,ప్రభాతవార్త :** దుద్యాల్ మండలం పోలేపల్లి గ్రామం ఎల్లమ్మ తల్లి దేవాలయం అవరణలో సోమవారం నాడు ముదిరాజ్‌ల అత్మీయసమ్మేళనం నిర్వహించారు.ఈ సమావేశంలో తాలుక అధ్యక్షులు నర్సిములు,దౌల్తాబాద్ జడ్‌పిటీసి మహిపాల్,ముదిరాజ్ కుటుంబసభ్యుల మధ్య కొడంగల్ నియోజకవర్గ అధికార ప్రతినిధిగా చెన్నంపల్లి అంజిని ఎన్నుకోవడం జరిగిందన్నారు.ముదిరాజ్‌లు అందరూ ఒక్కతాటిపైకి వస్తే ఈ ప్రభుత్వం ముదిరాజ్‌ల డిమాండ్లను నెరవేరుస్తుందన్నారు."అడుకుంటే హక్కులు రావు-కొట్లాడితేనే వస్తాయని"అన్నారు.ఈ కార్యక్రమంలో బొంరాస్‌పేట్ మండల అధ్యక్షులు తిరుపతయ్య,దుద్యాల్ వెంకటయ్య,నేల్లి రాములు,బిసి సంఘం నాయకులు శివకుమార్,దేవస్థాన నిర్వహకులు వెంకటయ్య,తాలుక యువనాయకులు మడిగే శ్రీనివాస్,బాలరాజ్, బుగ్గప్ప,తదితరులు పాల్గోన్నారు.



అత్మీయ సమ్మేళనంలో పాల్గోన్న ముదిరాజ్‌లు

## గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించాలి

**..తహసిల్దార్‌కు పిర్యాదు చేసిన మంబాపూర్ గ్రామస్థులు**



తహసిల్దార్‌కు పిర్యాదు చేస్తున్న మంబాపూర్ గ్రామస్థులు

**పెద్దేముల్, జనవరి 30, ప్రభాతవార్త:**

పెద్దేముల్ మండలం మంబాపూర్ పరిధిలోని గ్రామకంఠం స్థలాన్ని పరిరక్షించాలని యంపిటిసి వై.శ్రీనివాస్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యంపిటిసి వై.శ్రీనివాస్,మాజీ సర్పంచ్‌లు పి.ప్రకాషం, బోయిని నారాయణ, మాజీ ఉపసర్పంచ్ ఖలీల్, వార్డు మెంబర్లు మోహిద్, పి.కిరన్,హెచ్.శ్రీనివాస్, నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి,సంగెం వెంకటయ్య మాట్లాడుతూ మంబాపూర్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం దగ్గర ఉన్న గ్రామకంఠం స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారని, అట్టి స్థలాన్ని పూర్తిగా సర్వే చేయించి గ్రామ కంఠం స్థలాన్ని పరిరక్షించాలని అన్నారు. గ్రామ కంఠం స్థలం ఆక్రమించుకున్న వ్యక్తులు వద్ద ఏవైన లీగల్ పత్రాలు ఉన్నచో వాటిని పరిశీలించి, సరియైన పత్రాలు లేనిచో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి, యంపిడిఓ లక్ష్మప్పకు లిఖిత పూర్వకంగా పిర్యాదు చేసారు. పిర్యాదు చేసిన వారిలో యాలటి పుల్లప్ప, వై,బాలప్ప, యాలటి రాములు, నరేష్,గోపాల్ తదితరులు ఉన్నారు.

### మతాలు వేరైన మానవత్వం ఒక్కటే : జడ్‌పిటిసి ధారాసింగ్

**పెద్దేముల్, జనవరి 30, ప్రభాతవార్త:** హ్జ్రత్ సులేమాన్ సాహెబ్ దర్గా ఎంతో పవిత్రమైనదని జడ్‌పిటిసి ధారాసింగ్ అన్నారు. ఆదివారం రాత్రి పెద్దేముల్ మండలం తట్టెపల్లిలోని హ్జ్రత్ సులేమాన్ సాహెబ్ 62వ ఉర్సు ఉత్సవాలలో జడ్‌పిటిసి ధారాసింగ్, స్థానిక యంపిటిసి శంకర్ నాయక్,రాష్ట్ర టీపిసిసి మైనార్టీ సెల్ కన్వీనర్ యండి రియాజ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గోపాల్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్ కుమార్ గుప్తా, డివై నర్సిములు తదితరులు పాల్గొన్ని ప్రత్యేక ప్రార్ధనలు చేసారు. ఈ సందర్బంగా జడ్‌పిటిసి ధారాసింగ్ మాట్లాడుతూ 1995 నుంచి ఇప్పటి వరకు దర్గాకు వచ్చి ప్రత్యేక ప్రార్ధనలు చేస్తానని అన్నారు. మతాలు వేరైన మానవత్వం ఒక్కటేనని, కులమత భేదాలు లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

### బాలికల ఆత్మరక్షణకు కరాటే అవసరం : మేడ్చల్ జడ్పిటిసి శైలజ

**మేడ్చల్, జనవరి 30. ప్రభాతవార్త :** ఆత్మరక్షణకు బాలికలు కరాటేలో శిక్షణ పొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని మేడ్చల్ జిడ్పిటిసి శైలజ విజయనందరెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నెల రోజుల పాటు బాలికలకు కరాటేలో ఉచిత శిక్షణ అందించే కార్యక్రమాన్ని సోమవారం మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ బాలికలు దైర్యంగా ఉన్నప్పుడే అన్నింటిలో రాణించగలుగుతారని, అందుకు కరాటే నేర్చుకుని దైర్యంగా జీవించాలని సూచించారు. కరాటేతో అత్మరణతో పాటు బుద్దిబలంగా ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ప్రకాష్, ఉప సర్పంచ్ నర్సింహ, ప్రదానోపాధ్యాయులు విజయ్‌రెడ్డి, కరాటే ట్రైనర్, ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.